ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు


5

శుక్రవారం 29 నవంబరు 2024



రైతులకు.. రాయితీలు

- అన్నదాతలకు ప్రభుత్వం అండ
- యంత్ర పరికరాలు మొదలు రుణాల వరకు లబ్ధి
- వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కిన పథకాలు పునరుద్ధరణ
- ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున కేటాయింపులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.700 కోట్ల వరకు లబ్ధి







(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఐదేళ్లూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన ఘనత వైసీపీది. 2014–19 మధ్య కొనసాగిన అనేక పథకాలకు గత పాలకులు మంగళం పాడారు. ఇక కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నిబంధనాల చట్రంలో వారిని బిగించేశారు. విత్తన రాయితీలు, వ్యవసాయ అనుబంధ పాడిపరిశ్రమకు ఊతమిచ్చే అనేక కార్యక్రమాలను అటకెక్కించిన గత పాలకులు అన్నదాతల వెన్ను విరిచారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉండేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో గతంలో రైతులకు అందించిన అన్ని రాయితీలను తిరిగి పునరుద్ధరించింది. ఇందుకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాయి. మొన్నటి బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన యంత్రపరికరాలను వ్యక్తిగతంగా రాయితీపై అందించేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి గ్రూపుల పేరిట వైసీపీ శ్రేణులకు లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం యంత్ర పరికరాలను తిరిగి రైతులకు వ్యక్తిగతంగా అందించడానికే కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. తైవాన్ స్ప్రేయర్ల విషయంలో రైతులకు 8 నుంచి 10 వేల వరకు రాయితీని అందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన ట్రాక్టర్, నూర్పిడి యంత్రాలతో పాటు అత్యాధునికంగా మార్కెట్‌లోకి వచ్చిన వ్యవసాయ అనుబంధ యంత్రాలను రాయితీపై అందించే విధంగా ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి (మిగతా 6వ పేజీలో..)



- ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు తీపి కబురు
- 29న నగదు డ్రా చేసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7.59 లక్షల మందికి లబ్ధి
- రెండు నెలలుగా పెన్షన్ తీసుకోని వారికి నగదు చెల్లింపునకు ఏర్పాట్లు

పింఛన్లు.. ఒక రోజు ముందే



గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం.. సెలవు. అంటే వచ్చే నెలలో పింఛన్ ఒకరోజు ఆలస్యంగా అందుతుంది. ఎలా అని ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులు ఆలోచనలో ఉన్నారు. అయితే వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిసెంబరు నెల పెన్షన్ ఒక రోజు ముందే అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీ శనివారమే పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, ఆయా వ్యాధుల చేత బాధింపబడేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 29వ తేదీనే పెన్షన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేయాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. శనివారం సచివాలయ ఉద్యోగులందరూ పెన్షన్ పంపిణీ కోసం అందుబాటులో ఉండాలని జిల్లా అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం పెన్షన్ పొందని వారికి డిసెంబరు 2న అందజేయనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 2,55,258 మందికి, పల్నాడు జిల్లాలో 2,75,070 మందికి, బాపట్ల జిల్లాలో 2,29,635 మందికి ఒక రోజు ముందే పెన్షన్ చేతికి రానుంది. గత ప్రభుత్వ హయాంలో నెల మొదటి తేది సెలవు దినమైతే ఆ మరుసటి రోజు పెన్షన్ పంపిణీ చేసే వారు. అందువల్ల పెన్షన్‌దారులు కొంత ఇబ్బంది పడే వారు. సెలవులు వరుసగా రెండు, మూడు రోజులు వచ్చినప్పుడు కూడా అప్పటి ప్రభుత్వం పెన్షన్‌దారులను (మిగతా 6వ పేజీలో..)

6 కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా

- బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్



1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

8 రైల్వేయార్డు... రీమోడలింగ్

- మూడు వంతెనల వైపు ట్రాక్ విస్తరణ
- గుంటూరు స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలలో 24 భోగీల రైళ్ల నిలుపుదల

కోడిగుడ్డు ధర.. పైపైకి



- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు

వెయిట్ లిఫ్టింగ్ విజేత శివాజీ యూనివర్సిటీ

ఏఎన్‌యూలో ముగిసిన సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఈ-నామ్‌లోనే క్రయ విక్రయాలు జరగాలి

- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో క్రయవిక్రయాలన్నీ ఈ-నామ్ విధానంలోనే జరగాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయసునీత ఆదేశించారు. గురువారం ఆమె చుట్టుగుంటలోని కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిర్చియార్డులోకి సరుకు రాగానే లాట్ ఐడీలు జనరేట్ చేయాలన్నారు. దిగుమతులను సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు అనుమతించాలన్నారు. కొనుగోలు చేసిన సరుకు బిడ్డింగ్ సమయాన్ని మధ్యాహ్నం 3 వరకే అనుమతించాలని సూచించారు. కాటాదారులు(వేమెన్‌లు) తప్పనిసరిగా ఐడీ కార్డులు, యూనిఫారం ధరించి విధులకు హాజరు కావాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాటా చిట్టాలు కూడా వెంటనే ఇవ్వాలని, సేల్ అగ్రిమెంట్‌లు, సరుకు గేట్ బయటకు పోవడం అదే రోజు జరిగేలా చూడాలన్నారు. మచ్చుకాయలు తీయడం నిషేధించాలని ఆదేశించారు. ఎలాంటి జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈనామ్ పూర్తిగా అమలు చేయకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సమావేశంలో మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, ఏడీ రాజబాబు, ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు, సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులతో సమావేశమైన మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

● వరగాని చెక్‌పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ


రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

పెదనందిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరగానికి చెందిన తూమాటి శ్యాంసన్ (55), దేవరపల్లి జాన్ (14) ఇద్దరూ టీవీఎస్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులో నుంచి గుంటూరు-పర్చూరు రహదారిలోకి వస్తున్న క్రమంలో గుంటూరు వైపు నుంచి పత్తి విత్తనాల లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ ఏకనాథ్ తెలిపారు. పరారైన లారీ డ్రైవర్‌ను పట్టుకుని లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

8 ఇసుక ట్రాక్టర్లు సీజ్



కొల్లిపర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యా టలయానికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ జరిమానా విధించినట్లు తెలిపారు.

ట్యాంకర్ ఢీ కొని ఒకరి మృతి

బాపట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూర్తి రక్షణనగర్ దగ్గర టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న వారిని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ ఎస్ఐ చంద్రవతి తెలిపిన వివరాల ప్రకారం నరసాయపాలెం గ్రామానికి చెందిన దారా సుజనరావు (53) పట్టణంలోని 9వ వార్డు మూర్తి రక్షణనగర్‌లో తన అత్త వారింటికి టీవీఎస్ మోపెడ్‌పై వచ్చి తిరిగి వెళుతుండగా చీరాల వైపు వెళుతున్న ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న సుజనరా వు అక్కడికక్కడే మృతి చెందగా, వెనకాల కూర్చున్న దండమూడి ఏసుపాదంకు తీవ్రగాయాలు కావడంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల వితరణతో రెండో బస్సు

● రూ.35 లక్షల విరాళం ప్రకటించిన వైద్యులు



సుందరాచారికి లేఖను అందజేస్తున్న సునీల్ నాయక్, శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలకు దాతల సహకారంతో రెండు కొత్త బస్సులు సమకూరనున్నాయి. ఈ రెండు నూతన బస్సులను 1999వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందజేయనున్నారు. గత వారం ఈ బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు రూ.40 లక్షల వ్యయంతో 60 సీట్ల కెపాసిటీతో కొత్త బస్సును కాలేజీకి విరాళంగా ప్రకటించారు. వైద్య విద్యార్థుల అవసరాలకు మరో బస్సు కూడా అవసరమని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి కోరడంతో ఇదే బ్యాచ్‌కు చెందిన ఏడు మంది పూర్వ విద్యార్థులు రూ.35 లక్షలతో రెండో బస్సును విరాళంగా అందజేసేందుకు గురువారం ముందుకు వచ్చారు. విరాళం ప్రకటించిన వారిలో అమెరికాకు చెందిన ఎన్నారై వైద్యులు రుమటాలజిస్ట్ సాహిత్య మల్లిపెద్ది, ఇంటర్నరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ కాటూరు, ఇంకా ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ యెల్లినేడి (హైదరాబాద్), ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ శ్రీకాంత్‌రెడ్డి బసిరెడ్డి (తిరుపతి), ఆప్తమాజిస్ట్ సదాశివరావు తిమ్మసార్తి (హైదరాబాద్), ఆర్థోపెడిక్ సర్జన్ నరేష్‌రెడ్డి యర్రం (తెనాలి), ఆప్తమాలజిస్ట్ సునీల్ కుమార్ నాయక్ బుక్కె (విజయవాడ) ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దాత డాక్టర్ సునీల్ కుమార్ రెండో బస్సు విరాళానికి సంబంధించిన పత్రాలను గురువారం డాక్టర్ సుందరాచారికి అందజేశారు. కాలేజీ గ్రంథాలయ ఆధునీకీకరణకు, కొత్త జర్నల్స్ అందజేసేందుకు 99వ బ్యాచ్ విద్యార్థులు సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 1999వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావుతో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా

● బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్


మీడియాతో మాట్లాడుతున్న హీరో గల్లా అశోక్

తెనాలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభిమానుల అభిరుచికి తగ్గట్టుగా రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని సినీ హీరో గల్లా అశోక్ చెప్పారు. హీరో సినిమాతో సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో గల్లా అశోక్. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, ప్రిన్స్ మహేష్‌బాబు మేనల్లుడుగా గల్లా అశోక్ తెలుగు ప్రజలకు సుపరిచితుడే. తన తాత సూపర్‌స్టార్ కృష్ణ, మేనమామ ప్రిన్స్ మహేష్‌బాబు దత్తత గ్రామమైన బుర్రిపాలెంకు గురువారం వచ్చి సందడి చేశారు.

గ్రామంలో తన తాత సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇటీవల విడుదలైన దేవకీనందన వాసుదేవ చిత్రం సూపర్‌హిట్ కావడంతో అభిమానులతో కలసి ఆనందాన్ని పంచుకున్నారు. తొలుత గ్రామంలోకి విచ్చేస్తున్న అశోక్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని పలు ఆలయాల్లో హీరో అశోక్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కృష్ణ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ మామ ప్రిన్స్ మహేష్ బాబుతో కలిసి చిన్నతనంలో నాని చిత్రంలో నటించానని ఇప్పుడు హీరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చానని చెప్పారు. మహేష్ మామ అభిమానులు తొలి సినిమా నుంచి నన్ను అభిమానిస్తూ ఇండస్ట్రీలో స్టార్‌గా నిలబెట్టారని చెప్పారు. దేవకీనందన వాసుదేవ చిత్రాన్ని సూపర్‌హిట్ చేసిన ప్రేక్షకులకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌ను చూసేందుకు మహేష్ బాబు, కృష్ణ అభిమానులు గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ మహిపాల్‌రెడ్డి

'డ్వాక్రా'సభ్యులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి

● లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు సామాజిక అంశాల్లో విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి అన్నారు. యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా ఓల్డ్ గుంటూరు విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై డ్వాక్రా సంఘాలకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ సామాజిక భద్రత, డిజిటల్ అక్షరాస్యత, ఫోన్ పే, గూగుల్ పే గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి,మెప్మా సీఓ సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పీజీ కోర్సులలో ఖాళీ సీట్ల వివరాలను వెల్ల డించారు. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిస్ట్ స్టడీస్ 10, జర్న లిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కి యాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎం కామ్ 17, ఎంఈడీ 20, ఎమ్ఎల్ఐఎస్‌సి 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సీట్లు పొం దేందుకు ఏపీపీజీ సెట్ రాయని వారు కూడా అర్హులేనని తెలిపారు.

సోషల్ మీడియా నిందితుడికి రిమాండ్

రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి మళ్లీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించిన సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు మేరకు.. ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని అలియాస్ జాన్, మస్తాన్ వలి సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టారు. దీనిపై రెంటచింతల టీడీపీ నేత సన్నెగంటి సిద్దయ్య ఈ నెల 13న స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మహబూబ్ సుభానిని మాచర్ల కోర్టులో హాజరుపర్చగా జామీన్ ఎవరూ లేకపోవడంతో మెజిస్ట్రేట్ శ్రీని వాస్ కల్యాణ్ నెల్లూరు జైలుకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

43,251 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 43,722 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,251 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 39,427 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	8000	15000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	8500	13500
273	10000	10500	273	8000	13500
341	8000	15500	341	8000	15000
4884	--	--	4884	8000	13500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	11800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16000	తేజ	7500	16000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి గురువారం తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, ఫుల్‌హ్యాండ్స్ గోధుమ రంగు చొక్కా ధరించి 35-40 సంవత్సరాల వ్యక్తి కౌంటర్ ముందు భాగంలో పడి చనిపోయి ఉండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సహజ మరణమై ఉండవచ్చునని ఎస్ఐ తెలిపారు. వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకి తరలించి నట్లు తెలిపారు.

1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు, 28 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే ప్రమాణికుల రద్దీ దృష్ట్యా డిసెంబరు 1, 2, 6, 7, 9 తేదీల్లో ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడప నున్నట్లు డీఆర్ఎం ఎం.రామ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1వ తేదీన నంబరు 07131 కాచి గూడ - కొట్టాయం, 2వ తేదీన నంబరు. 07132 కొట్టాయం - కాచీగూడ, 6వ తేదీన నంబరు 07137 హైదరాబాద్ - కొల్లం, 7వ తేదీన నంబరు 07138 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు గుంటూరు మీదగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి


డాక్టర్ రమేష్‌చంద్ర

మాచర్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌జేసీ 1980-82 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఏఈఎన్ రమేష్‌చంద్ర ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులయ్యారు. కేంద్ర కార్యదర్శి హోదాలో విదేశీ వ్యవహారాల బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయన భారత రాయబారిగా పది దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలను కూడా చూశారు. ఈయన ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి పలు డిగ్రీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులవడంపై ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సరోజినితోపాటు అధ్యాపకులు హేమంబరరెడ్డి, లింగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు రమేష్‌నాయుడు, వెంకటేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక


షేక్ రోషన్

సత్తెనపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ రోషన్ అనే యువతి తొలి ప్రయత్నంలోనే సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా ఎంపికైంది. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా విద్యాను 2023లో పూర్తి చేసింది. ఏపీ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. 2024లో జరిగిన సివిల్ జడ్జి నిమామక పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించి సివిల్ జడ్జిగా ఎంపికైయ్యారు. ఆమె తల్లి సుజాత స్థానిక కోర్టులో జూనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తండ్రి షేక్ కరిముల్లా సిటీ కేబుల్ కరిముల్లాగా పట్టణ ప్రజలకు సుపరిచితుడు.

పాలిమర్‌ల సాయంతో కాలుష్యాన్ని తగ్గించొచ్చు

● విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని



గుంటూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవశక్తితో సులభంగా కరిగే పాలిమర్‌లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పూణెలోని సోమయ్య విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్బ్ ఇండియా ఏఎస్ఆర్ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను గురువారం వైభవంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ బ్రోచర్‌ను ముఖ్యఅతిథులు ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని సోమయ్య విద్యా విహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అవధాని మాట్లాడుతూ పాలిమర్ సైన్స్, టెక్నాలజీ రంగం ఎన్నో విధాలుగా ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. మరో ముఖ్యఅతిథి కేరళలోని సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెంజిత్ థామస్ మాట్లాడుతూ పాలిమర్‌లు ప్లాస్టిక్, రబ్బర్, ఫైబర్స్, ప్యాకేజింగ్, మెడికల్ పరికరాలు వంటి అనేక విభాగాల్లో వినియోగిస్తారని విద్యార్థులకు తెలియజేశారు. మరో ముఖ్యఅతిథి భువనేశ్వర్‌లోని ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయకృష్ణ మాట్లాడుతూ నానోపాలిమర్‌లు చిన్న పరమాణు స్థాయిలో రూపొందించి అధిక నాణ్యత కలిగిన వస్తువులను సృష్టించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 132వ ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ వేడుకలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఈ వేడుకల్లో 25 మందికి మెమోరియల్ అవార్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ వేడుకలను జర్నలిజం విభాగంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగిన వారికి ఫొటో కాంటెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో నిష్ణాతులై ఉండి మరణించిన వారి పేరు మీద 25 మెమోరియల్ అవార్డులకు ఫొటోలు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డులు పొందిన ఛాయా చిత్రాల ప్రదర్శనను ఈ వేడుకల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. విజేతలకు బంగారు పతకంతో పాటు నగదు బహుమతులను కూడా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అందజేయ నున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గురువారం అవా ర్డులు పొందిన వారి వివరాలు విడుదల చేశారు. కార్య క్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సి పాల్ ఎం.సురేష్ కుమార్, జర్నలిజం విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ జె .మధు బాబు, ఫొటోగ్రఫీ కోర్స్ అతిథి అధ్యాపకులు టి.శ్రీనివాస్ రెడ్డి, ఫొటోగ్రాఫర్ జి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసులో నిందితుడు?


నాగరాజు (ఫైల్ ఫోటో)

చేబ్రోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలిక హత్య కేసులో నిందితుడిగా ఉండి, నాలుగు నెలలుగా పరారీలో ఉన్న నిందితుడు నాగరాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలిక శైలజ జులై 15న హత్యకు గురైంది. పాఠశాలకు వెళ్లిన శైలజ సమీపంలోని నాగరాజు అనే గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్ ఇంటిలో శవమై కనిపించింది.పాఠశాలకు వెళ్లిన బాలిక హత్య కావడం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అనుమానితుడు నాగరాజు సంఘటన జరిగిన తర్వాత అదృశ్యం కావటంతోపాటు, సెల్ ఫోన్ వినియోగించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అతని కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి నాలుగు నెలలుగా శోధిస్తున్నారు. అయితే పోలీసులపై విమర్శలు రావటంతో సవాలుగా తీసుకుని నిందితుడిని పట్టుకోవడం కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. నిందితుడు రాజమండ్రిలో ఉన్నట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114.122.133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పింఛన్లు.. ఒక రోజు ముందే

(5వ పేజీ తరువాయి)

ఇదే రీతిలో ఇబ్బందులకు గురిచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ నెలలో బకాయిలు కూడా తీసుకోవచ్చు

గతంలో లబ్ధిదారులు ఏ కారణం చేతనైనా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెల ఆ మొత్తం కలిపి ఇచ్చే వారుకాదు. దీంతో లబ్ధిదారులు ఆ మొత్తం నష్టపోయి నట్లే. రెండు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే పూర్తిగా పెన్షన్ తొలగించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఏ కారణం చేతనైనా వరు సగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే, మూడో నెలలో రెండు నెలల పాత బకాయి కూడా కలిపి తీసుకునేలా నిబంధనలు మార్పు చేసింది. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని వారిని పాక్షిక వలసదారులుగా భావిస్తున్నారు. ఆ తర్వాత వచ్చి దరఖాస్తు అందజేస్తే తాత్కాలికంగా నిలిపివేసిన వారి పెన్షన్‌ను పునరుద్ధ రిస్తారు. గతంలో ఈ వెసులుబాటు లేదు.

భర్త పెన్షన్ భార్యకు

ఏ కారణం చేతనైనా పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు వెంటనే బదలాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భర్త చనిపోయిన పదిహేను రోజుల్లోనే భార్యకు మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రైతులకు.. రాయితీలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.220 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కౌలు రైతులను ఆదుకోవడానికి కూటమి పాలకులు ప్రత్యేక దృష్టిసారిం చారు. కేవలం సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరిపెట్టకుండా రుణాలను కూడా వారి దరికి చేర్చేలా ఆదేశాలు జారీ చేశారు. కౌలు రైతులను ఆదుకోవడంలో తమతో పాటు బ్యాంకర్లు కూడా కలిసిరావాలని పాలకులు కోరారు. గడచిన ఐదేళ్లలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరం లోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లకు మించి కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అలాంటిది ఈ ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.220 కోట్ల వరకు రుణాల ద్వారా కౌలు రైతులు లబ్ధి పొందనున్నారు

ఉద్యాన సాగు రాయితీలు

ఉద్యాన పంటలకు అందించే రాయితీల విషయంలో కూడా ఓ లక్ష్యంలో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో కలిపి దాదాపు రూ.90 కోట్ల వరకు ఉద్యాన సాగుకు ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల పెంపకం, కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు, ఎఫ్‌పీవోలో ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చి మెరుగైన మార్కె టింగ్ చేసుకునే సదుపాయిం కల్పించడం ఇందులో ముఖ్యమైనవి. మల్చింగ్ షీట్లు, పందిళ్ల నిర్వహణకు తోడు విస్తరణ వంటి అనేక పథకాలకు కేంద్రం అందించే మొత్తాలకు మ్యాచింగ్ గ్రాంటు జత చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించనుంది

రాయితీపై విత్తనాలు

50 శాతం రాయితీపై విత్తనాలు అందించే పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. రాయితీని పదిశాతానికి పరిమితం చేసి రెండేళ్ల పాటు అందించిన వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత దానికి కూడా పూర్తిగా మానేసింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే విత్తనాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సాగుదారులపై ఎకరానికి దాదాపు 5 నుంచి ఆరు వేల వరకు ఈ రాయితీ విత్తనాల వల్ల భారం తగ్గనుంది. దీని వల్ల ప్రభుత్వంపై మూడు జిల్లాల పరిధిలో అదనంగా పడే భారం దాదాపు రూ.120 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా.

భూసార పరీక్షలు.. అగ్రి ల్యాబ్‌లు..

ఏ పంటకు నేల అనువుగా ఉంటుందో శాస్త్రీయ పరీక్షల్లో అధ్యయనం చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడం ద్వారా వారికి ప్రభుత్వం మేలు చేసినట్లవుతోంది. కానీ గడచిన ఐదేళ్లలో ఒక్క శాంపిల్‌ను కూడా పరీక్ష జరిపి రైతులకు ఫలితాలను అందించిన దాఖలాలే లేవు. ఇక అగ్రిల్యాబ్‌లు సంగతి చెప్పక్కర్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే భూసార పరీక్షలపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిర్వహణ ఖర్చులకు నిధులను సైతం జారీ చేసింది. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్‌లో కూడా అన్నదాతల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయింపుల జరిపిన సంగతి తెలిసిందే. వీటిలో ముఖ్యంగా కరకట్టల పటిష్టతతో పాటు కాల్వల్లో పూడికతీతలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి తోడు రైతు సంక్షేమం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల వరకు వ్యయం చేసే విధంగా కేటాయింపులు దక్కనుండడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

శిక్షణా తరగతులను వేసవిలో నిర్వహించాలి

గుంటూరు(విద్య),నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధన సామర్థ్యాలు పెంపుదల కోసం నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల వలన తీవ్రమైన ఒత్తిడి ఫలితంగా ఉపాధ్యాయులు పరోక్షంగా, ప్రత్యక్షంగా మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని ఎస్టీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు డీ పెదబాబు, డీకే సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కేంద్రాల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, గుండెజబ్బుల వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భారత్ పేట 2/4 కు చెందిన బండి శ్రావణి (28) గురువారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బండి చంద్రారెడ్డికి ప్రకాశం జిల్లా బేస్తవారిపేట కు చెందిన శ్రావణి కి 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది వారికి ఇరువురు పిల్లలు సంతానం ఉన్నారు. భర్త చంద్రారెడ్డి ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ లో విధులు నిర్వహిస్తుంటాడు. అయితే శ్రావణి కొద్ది సంవత్సరాలుగా థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. స్థానికంగా వైద్యులు ఇచ్చిన మందులు వాడుతూ వస్తోంది. అయితే సమస్య పెద్దగా మార్పు లేకపోవడంతో భర్త ఇటీవల విజయవాడలో మరోవైద్యం వద్దకు తీసుకువెళ్లి చూపించారు. ఆయన ఆయా మందులకు డోస్ పెంచారు. ఎన్ని మందులు వాడుతున్నా థైరాయిడ్ తగ్గడం లేదని శ్రావణి మన స్తాపానికి గురైంది. ఇంట్లో చంద్రారెడ్డి తండ్రి కూడా ఉంటాడు. అయితే, గురువారం ఆయన విజయవాడ ఆస్పత్రికి, భర్త కార్యాలయానికి పిల్లలు స్కూలుకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న శ్రావణి ఉదయం సుమారు 11.15 గంటల సమయంలో ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి వెంకటలక్ష్మి తల్లి ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కూతురు అనారోగ్య సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరిట మోసం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై అరండల్ పేట పోలీస్‌స్టేషన్ లో చీటింగ్ కేసు నమోదు అయింది. స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీకి చెందిన మోదుగుల సుబ్బారావుకు, ఆయన చెల్లెలుకు రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని కైకాల రవీంద్ర అనే వ్యక్తి వారి నుంచి ఏడున్నర లక్షలు డబ్బులు తీసుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోబాల్టుపేట ఒకటో లైన్ కు చెందిన ఎర్రం ప్రభు కిరణ్ (27) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశమయ్యాడు. ప్రభు కిరణ్ తండ్రి ఎర్ర తిరుపతయ్య న్యాయవాదిగా చేస్తుంటాడు. ప్రభు కిరణ్ హైదరాబాదులోని గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. అక్టోబరు 11న ఆయన కోబాల్టుపేటలోని ఇంటి నుంచి హైదరాబాదులోని కార్యాలయానికి వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత నుంచి ప్రభు కిరణ్ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అప్పటినుంచి ప్రభు కిరణ్ గచ్చిబౌలిలోని తను ఉంటున్న గదికి వెళ్ళలేదు. బంధువులు తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించినా ప్రభు కిరణ్ ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి తిరుపతయ్య సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు పంపారు. ఈ మేరకు పట్టాభిపురం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాలపేట త్రీ బై వన్ కు చెందిన సుల్తానా పై ఆమె భర్త దాడి చేశాడు. మనస్పర్ధలు కారణంగా కొంతకాలంగా వారు విడివిడిగా ఉంటున్నారు. సుల్తానా తన కుమారుడిని స్కూలుకు తీసుకు వెళుతుండగా భర్త జానీ బాషా ఆమె వెళ్తున్న ఆటోను ఆపి ఆమెపై అసభ్యకరంగా మాటాడాడు. అంతేగాక, ఆమె చెంపపై కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షేర్ల వ్యాపారం పేరుతో మోసం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ మూడో లైన్ కి చెందిన ఇదర స్వర్ణలతకు ఆమె ఆడబిడ్డ నీలమ్మ షేర్స్ వ్యాపారంలో బాగా లాభాలు వస్తాయని చెప్పి నమ్మించింది. షేర్ల కంపెనీలో పెట్టుబడి పెడదామని చెప్పి నీలమ్మతో పాటు అంజమ్మ సంతోష్ మౌనిక పాలేటి రాజేష్ తదితరులు ఆమె వద్ద నుంచి రూ. 20 లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంసేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుకే

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుపడితే ఇక వారు జైలుకు వెళ్లడమేనని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన వీఐపీ రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి ఆయా వాహనాలను సీజ్ చేశారు. ఆయన తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులను శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పదే పదే పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా వారికి జైలు శిక్ష విధిస్తున్న విషయాన్ని మందుబాబులు గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు పూలే: కలెక్టర్


గుంటూరు లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే మాధవి, జడ్పీ ఛైర్ పర్సన్ హెనీ క్రిస్టినా తదితరులు

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆనాటి సమాజంలో అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ కొనియాడారు. మహాత్మ జ్యోతిబా పూలే 134 వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక హిందు కళాశాల సెంటరులోని మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, శాసనసభ్యులు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజా వలి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా విద్య కోసం నాడు పూలే చేసిన కృషి వలనే నేడు మహిళలకు విద్యా హక్కు కల్పించడం జరిగిందని, దీనికి పూలే దంపతులకు మహిళలందరూ రుణపడి ఉండాలన్నారు. ఆ మహనీయుని ఆశయాల స్ఫూర్తితో నేటి సమాజంలో యువత ముందుకు వెళ్లాలన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలుకు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. బీసీల జీవితాల్లో ఎంతో మార్పులు తెచ్చిన బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్నామన్నారు. ట్రావెలర్స్ బంగ్లా వద్ద జ్యోతిబా పూలే విగ్రహం పక్కన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. నసీర్ అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతుంటే, మరోవైపు అణగారిన, మహిళల్లో స్వాతంత్ర్య భావనలను కల్పించే దిశగా పూలే అడుగులు వేశారన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ ఆనాడు ఆ మహనీయులు చేసిన కృషి ఫలితంగా నేడు తమ లాంటి మహిళలు విద్యావంతులై, ఉన్నత పదవులు అధిరోహించడం సాధ్యమవుతోంద న్నారు. పూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస రావు, బీసీ సంఘాల నాయకులు పాల్గొని పూలేకు నివాళులర్పించారు.

నివాళులర్పించిన కమిషనర్


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పూలే దంపతుల కృషిని ఆదర్శంగా తీసుకొని, భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ అతిథి గృహం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు.

మహనీయుడు పూలే

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కుల వివక్ష లేని సమసమాజం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలె అని జోన్- 5 ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల కొండ శ్రీనివాస్, కసుకుర్తి హనుమంతరావు, ఈరంటి వరప్రసాద్, గోళ్ల ప్రభాకర్, కంచర్ల శివరామయ్య, శ్రీవల్లి, పాటిబండ్ల బలరాం, చిన్నబాజీ, బొంతల సాయి, సతీశ్‌బాబు, బెల్లంకొండ సురేశ్; లక్ష్మయ్య, సుందరంబాబు, వడ్డే శ్రీనివాసరావు, మధు, బాలు తదితరులు పాల్గొన్నారు.


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోవెలమూడి నాని, వేములకొండ, టీడీపీ నేతలు

ఓబీసీ కులగణన వెంటనే చేపట్టాలి


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైకే, జూపూడి తదితరులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓబీసీ కులగణనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చేపట్టాలని సీనియర్ న్యాయవాది, బహుజన ఉద్యమ నాయకుడు వైకే డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేన సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన మహాత్మాజ్యోతిరావు పూలే సభ కాకుమానువారితోట యానాది కాలనీ స్కూల్ సెంటర్‌లో నిర్వ హించారు. ఈ సందర్భంగా వైకే మాట్లాడుతూ సమాజంలో బహుజనుల స్థితిగతులు మారాలంటే రాష్ట్రంలో బహుజన ఉద్యమం నడపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అనంతరం జూపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, పీవీ రమణయ్య పాల్గొన్నారు.

● సంగడిగుంట విద్యుత్ భవన్‌లో పూలే చిత్రపటానికి గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఎస్ఏవో పాశం రామి రెడ్డి పలువురు అధికారులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ సూర్యప్రకాష్, ఏవో కృష్ణారెడ్డి, డీఈఈ ఖాన్ పాల్గొన్నారు.

● హిందూ కళాశాల సెం టర్‌లోని పూలే విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అం బటి రాంబాబు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నూరిఫాతిమా, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూలేచరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, నరసింహారావు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక ఉద్యమకారులని ఆయన చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు కోరారు. స్థానిక హిందూ కాలేజీ సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్దే సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి ఐలాండ్ కట్టాలని, పూలే సెంటర్‌గా నామకరణం చేయాలని కలెక్టర్, జీఎంసీ కమిషనర్‌కు నరసింహారావు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, కమిషనర్ స్పందించారని, రోడ్డు విస్తరణ జరగనున్నందున పూలే విగ్రహాన్ని ఒక వైపుకు జరిపి అక్కడే సావిత్రిబాయి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి ఐలాండ్ తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్, గౌడ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ లక్ష్మీ శైలజ, బోయ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయపు హక్కుల సాధకుడు పూలే

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయపు హక్కుల సాదకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్ అన్నారు. స్థానిక అరం డల్‌పేటలోని భీమ్‌భారత్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు.


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

చిట్టచివరి ఇంటికీ తాగునీరు అందాలి: ఎమ్మెల్యే మాధవి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో చిట్టచివరి ఇంటి వరకూ తాగునీరు అందాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై ఆమె చర్చించారు. నియోజక వర్గ పరిధిలో మంజూరైన పనులు ఎందుకు మొదలు పెట్టడం లేదని అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు ఆయా పనులు మొదలు పెట్టడం లేదని అధికారులు చెప్ప డంతో వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు పనులు, బ్రాడీపేటలో మిగిలిన పనులు పూర్తి చేయా లని ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి వీధి దీపం వెలగాలని, విస్తరించిన ప్రాం తాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో తాగునీరు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, శివారు ప్రాంతాలకు నీటిని అందిం చాలని ఆదేశించారు. చిన్న సమస్యలు కూడా పత్రికల్లో ప్రధాన శీర్షికన ప్రచురితం అవుతుంటే అధికారుల్లో ఎందుకు చలనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా, ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరి ష్కరించే బాధ్యత అధికారులదేనని అన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తాం

● ప్రభుత్వాస్పత్రిలో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్


ప్రభుత్వాస్పత్రిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని కార్పొరేట్ ఆసుపత్రుల కన్నా దీటుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. జీజీహెచ్‌లోని వివిధ విభాగాలను గురువారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వేధిస్తున్న వాహనాల పార్కింగ్ సమస్యపై దృష్టి సారించామని, ఈ విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, వైఖరి మార్చుకోకపోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరిన క్యాంటీన్‌ను పునర్ నిర్మించి నాణ్యమైన భోజన సదుపాయాలు లభించేలా చూస్తామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వాస్పత్రిని ఇష్టానుసారం దోచుకున్నారని ఆరోపించారు. వంద పడకలతో ట్రామా కేర్ సెంటర్, ఐసీయూ ఏర్పాటుకు కావాల్సిన ప్రదేశాన్ని సందర్శించి వాటికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, ఎల్లావుల అశోక్, వంగర ఏడుకొండలు, వేములకొండ శ్రీనివాసరావు, పోతురాజు చంద్ర పాల్గొన్నారు.

బాల్యవివాహాలను పకడ్బందీ ప్రణాళికతో నివారించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్ర స్థాయి నుంచి పకడ్బందీ ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, గ్రామ, వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ దశలలో బాల్య వివాహాల నిర్మూలన, పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి జిల్లాలోని ఏ ప్రాంతంలో కూడా బాల్య వివాహాలు జరగకుండా ముందస్తు నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయి వరకు సంబంధిత శాఖ అధికారులు నిర్వహించాలని, బాలికలు, మహిళల పునరావాసం కోసం పోలీస్, న్యాయ, వైద్య కౌన్సిలింగ్ తదితర అత్యవసర సేవలను అందించే వన్ స్టాప్ సెంటర్ గురించి అవగాహన కల్పించాలని, వల్నరబుల్ కోవకు చెందిన పిల్లలను గుర్తించి ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. మేడికొండూరు ,తెనాలి, వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరు తూర్పు మండలాల్లో బాల్య వివాహాల కేసులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 28 కేసులు నమోదైనట్లు చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం.39 ప్రకారం బాల్య వివాహాల నిర్మూలనపై సూచించిన అంశాలను సంబంధిత శాఖల అధికారులు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి పోలీసు యంత్రాంగం అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం పిల్లలు, మహిళల రక్షణ కోసం హెల్ప్ లైన్ నంబర్లతో రూపొందించిన స్టిక్కర్లు/పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జెడ్పీ సిఈఓ జ్యోతి బసు, డీఆర్ఓ ఖాజావలి, గుంటూరు ఆర్డిఓ కే శ్రీనివాసరావు, డీఎం అండ్ హెచ్ డాక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రేణుక తదితరులు పాల్గొన్నారు.

సంపత్‌నగర్‌లో జనసేన నేతల పర్యటన


స్థానిక మహిళలతో మాట్లాడుతున్న బోనబోయిన

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జనసేనతో పాటు కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ పార్టీలు కృషి చేస్తున్నాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ పర్యటనల్లో భాగంగా గురువారం ఆ పార్టీ నేతలు 20వ డివిజన్ పరిధిలోని సంపత్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)కు సంబంధించి బ్యాంక్ గ్యారెంటీలను రైస్‌మిల్లర్లు తక్షణమే సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆయన రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రెండు రోజుల వ్యవధిలో జిల్లాలోని రైస్‌మిల్లర్లంతా బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వాలన్నారు. అంతేకాక, ధాన్యం సేకరణకు తగినంత మేరకు గోనె సంచులను సమకూర్చుకొని ఎక్కడ అవసరం ఉందో ఆ రైతు సేవా కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. కోతలు ముమ్మరంగా జరుగుతున్న తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి మండలాల్లో రైతులు ధాన్యం ఆరబోసి ఉంచారు అని, అలాంటి ధాన్యం అకాల వర్షంతో పాడవకుండా ఉండేందుకు వెంటనే మిల్లులకు తరలించాలని జేసీ ఆదేశించారు. ధాన్యం తరలించే వాహనాలకు ఎలాంటి జీపీఎస్ సదుపాయం అవసరం లేదన్నారు. ఈ విధానం గురువారం నుంచి అమలులోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో రైస్‌మిల్లర్లు ఏ వాహనాన్ని అయినా సమకూర్చుకోవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ఏ ఒక్క రైతు కష్టపి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర క్వింటాల్ రూ. 2,320(గ్రేడ్-ఏ), రూ. 2,300(కామన్ వెరైటీ)ని ప్రతీ రైతుకు అందేలా చూస్తామన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వ్యవసాయ సహాయకులు ప్రతీ ఒక్కరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కోమలి పద్మ, పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు వస్తువులు అందజేస్తున్న చిన్నారులు

విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందిస్తున్న భాష్యం టాడ్లర్స్

గుంటూరు(విద్య),నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్ననాటి నుండే చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవరచేందుకు భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని భాష్యం బ్లూమ్స్ జెడ్ ఈవో వరలక్ష్మీ అన్నారు. భాష్యం టాడ్లర్స్ లో విద్యార్థినీవిద్యార్థులు గురువారం థాంక్స్ గివింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు నిత్యం తమకు సేవలందించే ఉపాధ్యాయేతర సిబ్బందికి ఆహార పదార్థాలు అందించి కృతజ్ఞతలు వ్యక్తపరిచారు. తమ తోటి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే నిరాశ్రయులైన వారికోసం తమ వంతు పండ్లు, దుప్పట్లు, ఆహార పదార్థాలను సేకరించి అనాధాశ్రమానికి అందజేశారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ కవిత పర్యవేక్షించారు.

ఫార్మసీ విద్యార్థులకు ఐపీఏ సేవలపై అవగాహన అవసరం

● ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ ఎడిటర్ డాక్టర్ ఎస్.విద్యాధర

గుంటూరు(విద్య),నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులకు ఇండియన్ ఫార్మసీ అసోసియేషన్ అందించే సేవలపై అవగాహన ఉండాలని ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ ఎడిటర్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ విద్యాధర మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి ఇండియన్ ఫార్మసుటికల్ అసోసియేషన్ యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ , క్షయ వ్యాధి నియంత్రణ, కాన్సర్ నివారణ వంటి అంశాలపై కేంద్ర ఆరోగ్య శాఖ చేపట్టిన ఆయుష్మాన్ భారత్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ స్కీంపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు ,కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదన రావు, కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష ,ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, జి.ఇందిరా ప్రియదర్శిని, వి.మౌనిక పాల్గొన్నారు.

ఉచితంగా బిట్‌బ్యాంక్,మోడల్ పేపర్లు పంపిణీ

గుంటూరు(విద్య),నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పది పరీక్షలకు హాజరయ్యే స్టేట్, సిబిఎస్ఇ విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రూపొందంచిన బిట్‌బ్యాంకు, మోడల్ పేపర్స్ ఉచితంగా అందజేయనున్నట్లు ఆ ర్‌జిఎం శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మోడల్ పేపర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. విద్యార్థిని విద్యార్థులు , ప్రధానోపాధ్యాయులు బిట్‌బ్యాంకు తీసుకుని విద్యార్థులకు అందజేయాలని సూచించారు. గగుంటూరు విద్యార్థులు(6281217277)లో, పల్నాడు విద్యార్థులు (8179004459), బాపట్ల విద్యార్థులు (8179880635) నంబర్లలో సంప్రదించి బిట్‌బ్యాంకు, మోడల్ పేపర్స్ తీసుకోవాలని సూచించారు. బిట్‌బ్యాంకు ఆవిష్కరణ కార్యక్రమంలో హనుమంతరావు, రామారావు, రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫైనాన్షియల్ కోడ్ ముఖ్యాంశాలు

● ఈదర వీరయ్య

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ ముఖ్యాంశాల గురించి పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిధుల జమా ఖర్చుల నిబంధనలు ఫైనాన్షియల్ కోడ్‌లో పొందుపరిచారన్నారు. ప్రత్యేక నిబంధనలు లేని సందర్భాలలో ఇవి స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తాయన్నారు. ప్రభుత్వం గాని లేక సంబంధిత అధికారి గాని చేసిన నిధుల మంజూరు, ఆ మంజూరు తేదీ నుంచి సంవత్సరం అమలులో ఉంటుందన్నారు. అయితే, పీఎఫ్ నుంచి అనుమతించే అడ్వాన్స్ మంజూరు ,మూడు నెలలు మాత్రమే అమల్లో ఉంటుందన్నారు. వేతన స్థిరీకరణ , వెనుకటి తేదీ నుంచి జరిగినప్పుడు దాని ఆధారంగా టీఏ, బకాయిలకు క్లెయిమ్ చేయడానికి అనుమతిస్తారన్నారు. ఉద్యోగి ఆప్షన్ ఇచ్చినప్పటి నుంచి ఆరు నెలలలోపు వేతన స్థిరీకరణ చేయాలన్నారు. అన్ని మేనేజ్‌మెంట్లలోని ఉపాధ్యాయులకు ఏప్రిల్ జీతాన్ని వేసవి సెలవుల ప్రారంభానికి ముందు రోజు చెల్లించాలని, ఆ రోజు సెలవు అయితే మరుసటి రోజు ఇవ్వాలన్నారు. ట్రెజరీ ద్వారా జీతం పొందే వారు నెల చివరి రోజుకు ఐదు రోజుల ముందుగా ట్రెజరీలో బిల్లులు ఇవ్వాలన్నారు. ఉద్యోగి మరణిస్తే జీతం, ఇతర ప్రతిఫలాలు చెల్లిస్తారన్నారు. సందేహం లేనప్పుడు లీగల్ హెయిర్ సర్టిఫికెట్ డాఖలు చేయకపోయినా మరణించిన ఉద్యోగి వారసులకు అతని జీతభత్యాలు చెల్లించాలన్నారు. ఉద్యోగి చెల్లించాల్సిన ఆదాయపు పన్నును జీతపు బిల్లుల నుంచి డ్రాయింగ్ అధికారి తగ్గించాలని ఈదర వీరయ్య తెలిపారు.

10 నాటికి వెండింగ్ జోన్స్ : జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో డిసెంబర్ 10 నాటికి వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వార్డ్ సచివాలయ కార్యదర్శులు సమిష్టిగా తమ సచివాలయ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో లాలాపేట, పట్నంబజార్ వార్డ్ సచి వాలయ కార్యదర్శులతో ఆక్రమణల తొలగింపుపై గురువారం సమావేశం నిర్వహించారు.

క్రీడలలో రాణిస్తే మేథో సంపద

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరితే మేథో సంపన్నలుగా రాణిస్తారని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి పీ నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాల, క్రీడా మైదానంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో ఉన్నత పాఠశాలల జిల్లా స్థాయి త్రోబాల్, కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు.

సమతుల్య ఆహారం, వ్యాయామంతో నే ఆరోగ్యం

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారం, వ్యాయామం జీవనశైల్లో మార్పు వల్ల ఆరోగ్యం వంతులుగా ఉండవచ్చునని జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ అన్నారు. అమరావతి రోడ్డు లోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆవరణ ప్రాంగణంలోని సుధర్మ హాల్‌లో గురువారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ధన్వంతరి హోమం , ధన్వంతరి జయంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా భారతి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె ఎస్ ఎన్ చారి అధ్యక్షత వహించారు.

ఖిద్మత్ వారియర్స్

వారంతా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అందరిలా మనకెందుకు అని వెళ్లిపోలేదు.. కష్టాల్లో.. ఆపదల్లో.. ఉన్న వారికి అండగా ఉండేందుకు ముందుకు వస్తున్నారు. మానవత్వాన్ని మించిన మతం లేదని నిరూపిస్తున్నారు. సీలింగ్ వర్క్స్, ఏసీ మెకానిక్‌లు, వెల్డింగ్ పని, పెయింటర్లు, ఇతర చేతి వృత్తులు, కూలీ పనులు చేసుకునే కొందరు యువకులు ఖిద్మత్ టీంగా ఏర్పడి విపత్కర పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందడుగేస్తూ... ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో కోవిడ్ వారియర్స్‌గా ముందుకొచ్చి వెలకట్టలేని సేవలందించారు. పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, పూట గడవని నిరుపేదలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు నిత్యావసరాలు, ఆర్థిక చేయూత అందిస్తున్నారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా తమ వంతు సేవలందిస్తూ మానవత్వాన్ని తట్టిలేపుతున్నారు.

- విపత్తుల్లో సహాయక చర్యలు
- కరోనా కాలంలో వెలకట్టలేని సేవలు
- పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానవత్వంతో సేవలందిస్తున్న సభ్యులు
- అధికార యంత్రాంగానికి తోడుగా సేవలు


అగ్నిప్రమాదం సంభవించిన చోట ఫైర్ సిబ్బందికి తోడుగా ఖిద్మత్ టీం సభ్యులు

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్‌కు పది రోజుల ముందు అంటే 2020, 14న సేవా దృక్పథం కలిగిన మంగళగిరికి చెందిన యాభై మంది యువకులు సమావేశమై ఆపన్నులకు సాయం చేయాలన్న లక్ష్యంతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి 'ఖిద్మత్ టీం'గా నామకరణం చేశారు. సేవా కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందిస్తున్న తరుణంలో కరోనా మహమ్మారి ముంచుకొచ్చింది. కరోనా లాక్‌డౌన్ రెండో రోజు మసీదు వద్ద ఖిద్మత్ టీం సభ్యులకు ఓ యాచకుడు తాగునీరు అందక రోడ్డుపై ప్రాణాపాయ స్థితిలో కనిపించాడు. కొద్ది రోజులకు కోవిడ్‌తో ఓ మహిళ మృతి చెందింది. ఆస్తి తన పేరిట రాయలేదన్న కారణంతో అంత్యక్రియలకు కొడుకు నిరాకరించాడు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ టీం సభ్యులు అతడ్ని మందలించి, ఆ మహిళకు అంత్యక్రియలు జరిపించారు. లాక్‌డౌన్ తొలినాళ్లలో జరిగిన ఈ రెండు సంఘటనలూ ఖిద్మత్ టీంపై తీవ్ర ప్రభావం చూపించాయి. అధికారుల అనుమతితో కోవిడ్ వారియర్స్‌గా రంగంలోకి దిగారు. టీం కన్వీనర్ ఆదాం షఫీ టీం సభ్యులకు కోవిడ్ క్లిష్ట పరిస్థితులపై దిశానిర్దేశం చేస్తూ చైతన్యవంతం చేశారు. కోవిడ్‌తో మరణించిన వారిని కనీసం ఆఖరి చూపు చూసేందుకు కుటుంబ సభ్యులు ముఖం చాటేసిన సమయంలో ఖిద్మత్ బృందం అంత్యక్రియలు నిర్వహించింది. లాక్‌డౌన్ సమయంలో పేదలకు, యాచకులకు 40 రోజులపాటు ప్రతిరోజు 300 నుంచి 400 మందికి భోజనం అందించారు. హోం క్వారంటైన్‌లోని బాధితులకు భోజనం సరఫరా చేశారు. కోవిడ్ సమయంలో వచ్చిన రంజాన్ పండుగకు 400 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. లాక్‌డౌన్ తర్వాత కూడా ఖిద్మత్ టీం సేవా కార్యక్రమాలను విస్తృతం చేసింది. తమకీ సమస్య ఉందని ఫోన్ వస్తే వెంటనే స్పందించి సాయం చేస్తున్నారు. వృద్ధులకు నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. వితంతు, ఒంటరి మహిళలు, అనారోగ్య బాధితులు, క్షతగాత్రులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చేయూత అందిస్తున్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు, క్రీడాకారులకు ఆర్థికసాయం అందించారు. ఇంటింటికీ పించన్ పంపిణీ లేనప్పుడు వృద్ధులు, దివ్యాంగులను పించన్ పంపిణీ కేంద్రాలకు తరలించేవారు. అగ్ని ప్రమాదాల సమయంలో నష్ట నివారణను తగ్గించేందుకు ఫైర్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారు. తుపాన్లు, వరదల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోను, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులకు తోడుగా నిలుస్తున్నారు.


కోవిడ్‌తో మృతిచెందిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఖిద్మత్ టీం సభ్యులు

మయన్మార్ విద్యార్థికి అంత్యక్రియలు

మయన్మార్‌కు చెందిన కొండప్ప అనే విద్యార్థి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ చదువుతూ పాముకాటుకు గురై మృతిచెందాడు. అంత్యక్రియలకు ఎవ్వరూ ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ బృందం కొండప్ప మృతదేహానికి మంగళగిరి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించింది. బౌద్ధ భిక్షువులు సైతం ఖిద్మత్ టీం సేవలను అభినందించారు. ఎర్రబాలెం గ్రామంలో పాముకాటుతో చనిపోయిన గోమాతను హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.


ఇటీవల మయన్మార్‌కు చెందిన పీజీ విద్యార్థి కొండప్ప అంత్యక్రియల్లో..

ఖర్చంతా ఖిద్మత్ టీం సభ్యులదే...

50 మందితో ప్రారంభమైన ఖిద్మత్ టీం ఇప్పుడు 500లకు చేరింది. అనేక మంది ఖిద్మత్ టీం ద్వారా సేవలందించేందుకు ముందుకు వచ్చారు. సేవా కార్యక్రమాలకు అవసరమైన ఖర్చును సభ్యులే పూర్తిగా భరిస్తున్నారు. రోజువారీ వేతనాలతో తాము సంపాదించిన దాంట్లో నెలకు రూ.200 చొప్పున సేకరిస్తారు. వాటి ద్వారా ప్రతినెలా ఓ పది కుటుంబాలకు వివిధ రూపాల్లో సాయం అందిస్తున్నారు.


మానవత్వ ధీర అవార్డు

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విశేష సేవలందించిన ఖిద్మత్ టీంను అధికార యంత్రాంగం గుర్తించింది. అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ ఏపీ పోలీసు శాఖ తరఫున ఇచ్చిన అవార్డుల్లో ఖిద్మత్ టీంకు మానవత్వ ధీర పురస్కారాన్ని ప్రకటించగా అప్పటి ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్ ఖిద్మత్ ప్రదానం చేశారు. ఖిద్మత్ సేవలకు మెచ్చిన అనేక స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు పలు విధాలుగా అవార్డులను ప్రదానం చేశాయి.

కులమతాలకు అతీతంగా సేవ

కరోనా సమయంలో జరిగిన అనేక సంఘటనలు మా టీం సభ్యులను ఎంతగానో కలచివేశాయి. ఆపదలో ఉన్న వారికి తమకు చేతనైనంత సాయం చేయాలని నిర్ణయించాం. మా మత పెద్దలు, కుటుంబ సభ్యుల నుంచి మంచి ప్రోత్సాహం, సహకారం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, సమాజంలో అన్ని వర్గాల నుంచి అందిన ప్రశంసలు మాలో మరింత స్థైర్యాన్ని నింపాయి. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం. ఏ ఆపద వచ్చినా తమను సంప్రదిస్తే సహకారం అందిస్తాం. సమాజంపై బాధ్యత కలిగిన యువత తోటి వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలి.


-షేక్ ఆదాం షఫీ, టీం కన్వీనర్




ఖిద్మత్ టీం సభ్యులు

ఉత్తరాఖండ్‌పై మ్యాచ్‌లో ఆంధ్రా పట్టు


లోహిత్ (7 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు పట్టు బిగించింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో భాగంగా తొలిరోజు ఆంధ్రా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 48.4 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా బ్యాటర్లు ఈశ్వర్ రిత్విక్ 47, వరుణ్ సాత్విక్ 43 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ రితిక్ దూహరాన్ 16.4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. ఆంధ్రా బౌలర్ ఏఎన్‌వీ లోహిత్ 7.4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 19 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 76 పరుగులు చేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 39 పరుగులు చేశాడు. దీంతో ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 130 పరుగుల ఆధిక్యంలో వుంది.


రితిక్ (7 వికెట్లు)

వెయిట్ లిఫ్టింగ్ విజేత

శివాజీ యూనివర్సిటీ

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. అలాగే రన్నర్స్‌గా విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇందులో బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబాయికి చెందిన క్రీడాకారిణి సౌమ్య దాల్వి కైవసం చేసుకున్నారు. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి టి.రేణుక స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరీ అవార్డును సొంతం చేసుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి గంగాధరరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ పోటీల నిర్వహణకు మహిళలతోపాటు ఆయా యూనివర్సిటీల టీం మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ సహకరించినందుకు అభినందించారు. 365 మంది మహిళా క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారన్నారు. టెక్నికల్ కమిటీ చీఫ్‌గా వ్యవహరించిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య, ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ దిల్షా బాబు, డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని వీసీ ఆచార్య కే గంగాధరరావు చేతుల మీదగా అందుకుంటున్న శివాజీ యూనివర్సిటీ విద్యార్థులు

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు

ముఖ్యమంత్రి హాజరు

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లపై విద్యాశాఖకమిషనర్ సమీక్ష

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిపై నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారవడంతో విద్యాశాఖ కమిషనర్ గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిసరాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబరు 7న జరిగే సీఎం కార్యక్రమానికి హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఉన్నతస్థాయికి ఎదిగిన పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షఅభియాన్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్లు శ్రీనివాస రెడ్డి, మధుసూధనరావు, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి విలియమ్స్, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజాదెబోరా, మహిళా శిశు సంరక్షణశాఖ పీడీ కె.ఉమా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ వెంకటమురళి


అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖకమిషనర్ విజయరామరాజు

నూతన భవన సముదాయానికి

రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను తెనాలిలోని ఐతానగర్‌కు చెందిన గడ్డిపాటి నాగయ్య చౌదరి, ఉషాబాల విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో కే జే ఎస్ ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు గురువారం చెక్కును అందజేశారు. సామినేని కోటేశ్వర రావు మాట్లాడుతూ దాతలు అంద జేస్తున్న విరాళాలను సద్వినియోగం చేస్తామని అన్నారు. నూతన భవన నిర్మాణంను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేజేఎస్ ఎస్ ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, పాలకవర్గ సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, మైనేని సీతారామయ్య, ఆర్‌వీఆర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ, గడ్డిపాటి మనోజ్ కుమార్, మారుతి వరప్రసాదు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

కోడిగుడ్డు ధర.. పైపైకి

- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర రోజురోజుకు పైపైకి చేరుతోంది. గుడ్డు ధర హోల్‌సేల్‌లోనే రూ.6కు చేరింది. వంద గుడ్ల ధర రూ.600లుగా పేర్కొంటూ విజయవాడ జోన్ నెక్ వ్యాపారులు ప్రకటించారు. దాంతో సాధారణ చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. అయితే గుడ్డు ధర మరింతగా పెరిగే ఛాన్స్ లేకపోలేదని పౌల్ట్రీ వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు కార్తీకమాసం కావడంతో సాధారణంగా మాంసాహారం, గుడ్ల విక్రయాలు పడిపోతుంటాయి. అయినా కోడిగుడ్డు ధరలు మాత్రం రోజురోజుకు పెరగడం సామాన్య ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కోడిగుడ్డు అంటే ఇష్టపడని వారుండరు. విభిన్న రకాలుగా ఆహారంలో కోడిగుడ్డును ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్ల డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంతేగాక గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచే కాక తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కోడిగుడ్లు పశ్చిమ బెంగాల్‌కు పెద్దఎత్తున ఎగుమతులు ఉన్నాయని ఫలితంగానే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఈ నెల మొదటి వారంలో 100 గుడ్లు రూ.565 నుంచి రూ.535 వరకు తగ్గి మరలా పెరుగుతూ వచ్చింది. గత వారంలో 100 గుడ్లు రూ.580, రూ.590కు కొనసాగింది. తాజాగా 100 గుడ్లు రూ.600లకు చేరింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల్లో కేక్‌లకు పెద్దఎత్తున కోడిగుడ్లను వినియోగించే అవకాశం ఉందని తద్వారా డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని చెబుతున్నారు. ఫలితంగానే కోడిగుడ్డు ధర ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెరిగింది. దీంతో ఇదే అదునుగా చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ధర కొంతకాలం కొనసాగే అవకాశం ఉంది.



రైల్వేయార్డు...

రీమోడలింగ్


డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద ప్రారంభమైన గుంటూరు రైల్వే యార్డు రీమోడలింగ్ పనులు

- మూడు వంతెనల వైపు ట్రాక్ విస్తరణ
- గుంటూరు స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలలో 24 భోగీల రైళ్ల నిలుపుదల
- కోచింగ్ డిపోకు సులభతరం కానున్న రైళ్ల రాకపోకలు
- నూతనంగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నిర్మాణం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేజంక్షన్‌లో అన్నీ ప్లాట్‌ఫాంలలోకి 24 భోగీలు (గరిష్ఠ సంఖ్య) ఉండే రైళ్లను నిలుపుదల చేసేందుకు అవసరమైన యార్డు రీమోడలింగ్ పనులను రైల్వే శాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగానే మూడు వంతెనల వైపున రోడ్డు ట్రాఫిక్ బ్లాక్‌ని తీసుకొన్నది. 60 రోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేసి ఆ తర్వాత పెండింగ్ యార్డు రీమోడలింగ్ పనులు చేపట్టాలని భావిస్తున్నది. అంతేకాకుండా మూడు వంతెనల వైపు రోడ్డు మార్గంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేయడం ద్వారా 2025వ సంవత్సరం నుంచి శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభమైనా ట్రాఫిక్‌ని ఈ మార్గం నుంచి మళ్లించేందుకు మార్గం సుగమమౌతుంది.

- రైల్వేబోర్డు ఇటీవలే గుంటూరు రైల్వేస్టేషన్‌కు ఎన్‌ఎస్‌జీ-3 నుంచి ఎన్‌ఎస్‌జీ-2 కేటగిరీగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే అందుకు తగినట్లుగా సదుపాయాలు ఇక్కడ అందుబాటులో లేవు. ముఖ్యంగా పేరుకు ఏడు ప్లాట్‌ఫాంలు ఉన్నా అందులో 24 భోగీల ఫుల్ లెంగ్త్ రైళ్లను కేవలం 1, 4 ప్లాట్‌ఫాంల మీదనే నిలుపుదల చేయగలరు. మిగతా ప్లాట్‌పాంలలో 15 నుంచి 18 భోగీల రైళ్లను మాత్రమే తీసుకోగలరు. ప్రస్తుతం కొన్ని రైళ్లను ఆరో నంబరు ప్లాట్‌ఫాంలోకి తీసుకోవడం వలన ప్రయాణీకులు ఎక్కాల్సిన భోగీలు ప్లాట్‌ఫాం దాటిపోయి ఉంటున్నాయి. దాంతో వాటిల్లోకి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలానే రైలు దిగే సమయంలోనూ ఇక్కట్లు ఎదురౌతున్నాయి. దీని దృష్ట్యా యార్డు రీమోడలింగ్ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ. 125.16 కోట్లకు పైగా నిధులు కూడా విడుదలయ్యాయి.
- యార్డు రీమోడలింగ్‌లో భాగంగా కొత్తగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంని కూడా నిర్మించబోతున్నారు. అలానే మిగతా ఏడు ప్లాట్‌ఫాంలలో కూడా 24 భోగీల రైళ్లని నిలిపేలా విస్తరిస్తారు. ప్రస్తుతం గుంటూరు కోచింగ్ డిపో మూడు వంతెనల వైపు ఉన్నది. కోచింగ్ డిపోలోకి రైళ్లు వెళ్లాలంటే ఆ సమయంలో గుంటూరు - విజయవాడ రైళ్లను నిలిపేయాలి. అలానే కోచింగ్ డిపోలో భోగీల అమరిక (షంటింగ్) చేసేటప్పుడు కూడా గుంటూరు నుంచి విజయవాడ వైపునకు రైళ్లను పంపే పరిస్థితి లేదు. దీంతో సమయపాలన దెబ్బ తింటున్నది. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించబోతున్న ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నుంచి నేరుగా కోచింగ్ డిపోకి రైళ్లు వెళ్లేందుకు మూడు వంతెనల మీదగా రైలుమార్గాన్ని నిర్మిస్తున్నారు. ఇందు కోసమే ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేశారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నందీశ్వరునికి అభిషేక పూజలు

తెనాలి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని కఠెవరం శివాలయంలో నందీశ్వరునికి ఆలయ అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. నందీశ్వరునికి అభిషేకం జరపడం ద్వారా సకలపాపాలు తొలగిపునీతులవుతారని పండితులు చెబుతున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భార్యను వేధిస్తున్న భర్తతో పాటు కుటుంబ సభ్యులపై కూడా టు టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఈటీ కాలనీకి చెందిన పసుపులేటి వీరయ్య నాయుడుతో వెంకటలక్ష్మి అనే మహిళతో రెండేళ్ల క్రితం వివాహమైంది. గత కొంత కాలంగా వెంకటలక్ష్మిని ఆమె మామ నారాయణరావు, మరిది భానుకిరణ్, ఆడపడుచు రమ వేధిస్తున్నారు. ఇంట్లో నుండి వెళ్లిపొమ్మని హింస పెడుతున్నారని మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ సూచనల మేరకు టు టౌన్ ఎస్‌ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే

జీవితం అంధకారమే

● డీసీఐ సభ్యురాలు డాక్టర్ రేవతి.

పెదకాకాని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమేనని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) సభ్యురాలు డాక్టర్ పీ.రేవతి హెచ్చరించారు. గురువారం తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అధ్యక్షత ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేవతి మాట్లాడుతూ.. విద్యార్థులు ర్యాగింగ్‌కి పాల్పడకూడదని, అది విద్యార్థుల మధ్యన ఐక్యతను దెబ్బతీస్తుందని అన్నారు. ర్యాగింగ్ హానికరమైన ప్రభావాల గురించి ఆమె వివరించారు. సురక్షితమైన, సమ్మిళిత క్యాంపస్ వాతావరణాన్ని ప్రోత్సహించడం అనే ప్రాథమిక లక్ష్యాన్ని నొక్కి చెప్పారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణా రెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏజే సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రగడ కోటయ్య, గుర్రం గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముత్తింశెట్టిపాలెం కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రభాకరరావు, శ్రీనివాసరావు, వెంకట ప్రసాద్, వెంకటకృష్ణారావు, మదన్మోహనరావు పర్యవేక్షించారు. చేపూరి రాధిక, లావణ్య ఆర్థిక సహకారం అందించారు.

ప్రాంగణ ఎంపికలో 68 మంది

ఎఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 68 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని ఆ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ క్వాలీఫైయర్ టెస్ట్‌లో ఎంపికైన వారిని విజయవాడలో మూడు ప్యానల్ సభ్యుల బృందాలు పరీక్షించాయని గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన తెలిపారు. తమ కళాశాల నుంచి 68 మంది విద్యార్థులకు కంపెనీ ఆఫర్ లెటర్స్ పంపిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ బీఎస్సీ, బీకాం విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో అంతర్జాతీయ ప్రమాణాలు అవలంబిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.06 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని చెప్పారు. ప్రాంగణ ఎంపికలకు కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ రాంచంద్, అధ్యాపకులను అభినందించారు.

మధ్యాహ్న భోజనంలో

తగిన జాగ్రత్తలు అవసరం

కొల్లిపర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం పథకంపై ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. లేకుంటే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని ఎంఈవో తెలియజేశారు.

ప్రతి మూడు నెలలకు

ఓటు నమోదు అవకాశం

● సబ్ కలెక్టర్ సంజనా సిన్హా



సబ్ కలెక్టర్ సంజనా సిన్హాను సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్ వీరనారాయణ

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మూడు నెలలకు ఓ పర్యాయం ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా తెలిపారు. నాజరుపేట వివేకా మహిళా కళాశాలలో గురువారం ఓటు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతీ యువకులకు ఎప్పుడు 18 సంవత్సరాలు నిండితే అప్పుడు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే శక్తి ఓటర్లకే ఉంటుందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించేందుకు ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఓటు నమోదుతో పాటు చిరునామా మారినా, మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉంటుందన్నారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ, సమాజం దశ దిశా మార్చగలిగే శక్తి ఓటర్లకు మాత్రమే ఉంటుందన్నారు. యువతీ యువకులు ఓటు నమోదు కోసం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవడంతో పాటు ఆయా పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలను కలవవచ్చని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, మురళి, రాగూర్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ జనార్ధనరావు తదితరులు

● జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి
● పట్టణంలో కార్డన్ సర్చ్

తెనాలి, మారీసుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి తెలిపారు. గురువారం పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, తెనాలి డీఎస్పీ జనార్ధనరావుతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ క్రమంలో త్రీటౌన్ పరిధిలో ఐదుగురు రౌడీషీటర్లు, అనుమానితులైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి పత్రాలు, నంబరు ప్లేట్ లేని 30 ద్విచక్ర వాహనాలను, 5 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో తెనాలి సబ్ డివిజన్ పరిధిలో నేరనియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామన్నారు. అందులో భాగంగా స్థానిక ప్రత్యేక పోలీసు బలగాలతో కార్డెన్ సెర్చ్ ద్వారా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి నేరస్తుల ఆనవాలను గుర్తిస్తున్నామన్నారు. తాము సీజ్ చేసిన వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపిస్తే వాటిని అప్పగిస్తామన్నారు. సబ్‌డివిజన్ వ్యాప్తంగా కార్డన్‌సెర్చ్‌ను రానున్న రోజులలో కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు కూడా నేర నియంత్రణకు సహకరించాలన్నారు. అనుమానస్పద వ్యక్తులు, అసాంఘీక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు బెల్లం శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, రాంనాయక్, రమేష్‌బాబు, ఎస్‌ఐలు ప్రకాశ రావు, ప్రతాప్ కుమార్, సుబ్బయ్య, బాబురావు, కోటేశ్వరావు, రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి
● ఆశా కార్యకర్త మృతికి నివాళి

తెనాలి, మారీసుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని పలు ఆరోగ్య కేంద్రాలను ఆమె పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల నుంచి తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా నందులపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తగా పని చేస్తున్న ముమ్మా శివకుమారి అనారోగ్య కారణాలతో ఈనెల 24న మృతి చెందింది. ఆమె చిత్రపటానికి పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఆరోగ్య విస్తరాణిధికారి బాలచంద్రమౌళి, చింతల ప్రసన్న, పుష్పలత, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పొన్నూరుటౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జియావుల్ హక్ కోరారు. పట్టణంలోని పీబీఎన్ కళాశాల్లో గురువారం స్వీప్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రతిజ్ఞ చేసారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై స్వీప్ కార్యక్రమన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు. విద్యార్థులో ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీకాంత్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

పెదకాకాని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 17 బాలుర పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు క్యారమ్స్ ఫైనల్ విభాగం పోటీలు జరిగాయి. కర్నూలు, గుంటూరు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లా విద్యార్థులు సెమీస్‌కి అర్హత సాధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, 13 జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో

సంగం డెయిరీ ముందంజ

కొల్లిపర, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ రైతులను ఆదుకోవడంలో ముందంజలో ఉంటుందని సంగం డెయిరీ సూపర్‌వైజర్ వెంకట్రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని దావులూరిపాలెంలో పాలసొసైటీలో పనిచేసే తుల్లిమిల్లి సుగుణమ్మ ఇటీవల మృతిచెందటంతో డెయిరీతరుపున వారి కుటుంబ సభ్యులకు బీమానగదు రూ.1.49లక్షల చెక్కును సంగం డెయిరీ అధికారులు, పాల కేంద్రం అధ్యక్షుడు తోటా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు సంగం డెయిరీ రైతులకు అనేక రాయితీలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జంపని మిల్క్ సెంటర్ ఇన్‌చార్జీ ధూళిపాళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

30న నాట్కో ఆధ్వర్యంలో

ఉచిత వైద్య శిబిరం

పొన్నూరుటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్లమూడిపాడు గ్రామంలో ఈ నెల 30 న నాట్కో సంస్థల చైర్మన్ నన్నపనేని వెంకయ్య చౌదరి జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ కే.రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌వీ పసాద్ కంటి ఆసుపత్రి, వైజయంతి పర్ఫెక్ట్ స్మైయిల్ డెంటల్ అండ్ కాస్మోటిక్ క్లీనిక్, బృంద మల్టీస్పెషాల్టీ హాస్పటల్ సహకారంతో గోలమూడిపాడు గ్రామంలో కన్ను, దంతం, కీళ్ల నొప్పులు, షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి వ్యాధులకు ఉచిత వైద్యం, మందులు అందచేయనునట్లు తెలిపారు. అలాగే అవసరమైన వారికి కళ్ల ఉచితంగా జోళను అందజేస్తామన్నారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్స చేయించనునట్లు తెలిపారు. వివరాల కోసం 9640635341 నెంబరును సంప్రదించాల్సిందిగా రమణారెడ్డి కొరారు.

ఘనంగా సత్యదేవ వ్రతాలు

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : షరాఫ్‌బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం సత్యదేవ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో దంపతులు పాల్గొన్నారు.

మురుగును తొలగించండి

● అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలోని మురుగునుపూర్తిగా తొలగించాలని పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం పట్టణంలోని 28వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, కార్మికులకు పలు సూచనలు చేశారు. డ్రెయిన్లలోని, మురుగు కాలువల్లోని మురుగును, రోడ్లపై చెత్తను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు చెత్తను, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు ఇంటి వద్దనే అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా సర్వే పూర్తిచేయండి

తెనాలి, మారీసుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేలను నిర్ణీత సమయలో పూర్తిచేయాలని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కొత్తపేటలోని సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ సర్వే రికార్డులను పరిశీలించి, డీహెచ్‌హెచ్ సర్వేను 100 శాతం పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉచిత సేవలు అందించేందుకు వైద్యులు ముందుండాలని డాక్టర్ పువ్వాడ యశోదర అన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని శారదా సర్వీస్ సొసైటీలో గురువారం యశోదర దంపతులకు స్వచ్ఛంద సేవకురాలు షారోన్ అవార్డును ప్రదానం చేశారు. పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పలు దేశాల్లో ప్రజలకు సేవలు అందించిన షారోన్ పేరిట అవార్డు అందుకోవడం తన బాధ్యతను పెంచిందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ, పేదలకు సేవలు చేసిన ప్రతి ఒక్కరూ చిరకాలం వారి మనస్సులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శారద, ప్రదీప్ దోనేపూడి, సినీ దర్శకుడు దిలీప్‌రాజా, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, విశ్రాంత ఆదాయ పన్ను అధికారి మధుబాబు, వజ్రాల రామలింగాచారి, ఈదర వెంకటపూర్ణచంద్, శ్రీనివాస యాదవ్, వేమూరి విజయభాస్కర్, రమణ, బెల్లంకొండ వెంకట్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి కోచ్ శ్రీనివాసరావుకు

ఏషియన్ తైక్వాండో గుర్తింపు

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి తైక్వాండో కోచ్ శ్రీనివాసరావుకు ఏషియన్ తైక్వాండో యూనియన్ గుర్తింపు లభించింది. ఇటీవల పూణేలో యూనియన్ ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఎంతోమంది బాల బాలికలను ఆత్మరక్షణ కోసం క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న కోచ్‌లను గుర్తించి ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. గురువారం కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావును ఈదర వెంకట పూర్ణచంద్, రామారావు తదితరులు అభినందించారు.

జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు

మహేష్‌కు ఘన సన్మానం

తెనాలి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :జాతీయ స్థాయిలో నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారుడు కొమరగిరి మహేష్‌ను సత్కరించారు. స్థానిక కొత్తపేట ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో పలువురు ఆయనను అభినందించారు. చత్తీస్‌ఘడ్‌లో ఆలిండియా ఎలక్ట్రిసిటి స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో మహేష్ తన సహ ఉద్యోగితో కలిసి డబుల్స్‌లో రన్నర్‌గా నిలిచారు. త్రీ టౌన్ సిఐ రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో ఏఎన్‌యూ

నృత్య విభాగం ప్రదర్శన

పెదకాకాని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ నృత్యవిభాగం (భరతనాట్య) విద్యార్థులు హైదరాబాదులో జరిగిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొని యక్షగాన సాంప్రదాయంలో ఆంగిక వాచిక ఆహార సాత్విక అభినయాలతో భక్తుల మనసులను గెల్చుకున్నారు. కాంతారాగా నిక్షిత వరాహముగా రంగమణి, హిరణ్య, హెరిన్యాశులుగా విజిత పలుగురు యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కోటి దీపోత్సవ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి విద్యార్థులకు యూనివర్సిటీ అధ్యాపకులు ఎం.వీ. విశ్వనాథ్‌ను సత్కరించి ప్రశంసించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

తెనాలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. గురువారం గ్రామంలోని బీసీ కాలనీలో పారిశుధ్య కార్మికులతో కాలువల పూడికతీత పనులు చేపట్టారు. ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పలు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని నివారించాలని, సీజనల్ వ్యాధుల నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణే లక్ష్యం

● పట్టణ పురపాలక సంఘ కమిషనర్ శేషన్న

ఫటా ఫట్



మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని సుందరీకరించి ప్రజలు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించేలా మునిసిపల్ యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. గురువారం కమిషనర్ శేషన్నతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్..'

ప్ర: పట్టణంలో ఏయే పారిశుధ్య పనులు చేపడుతున్నారు?

జ: ప్రతిరోజు పారిశుధ్య కార్మికులతో వార్డులలో పర్యటించి కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపు, గృహాల నుంచి వచ్చే చెత్తను సేకరిండం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం వంటి కృషి చేస్తున్నాం.

ప్ర: వార్డు పర్యటనలో ప్రజలు మీ దృష్టికి ఏం సమస్యలు తీసుకువస్తున్నారు ?

జ: పలు వార్డులలో కుళాయిల ద్వారా మంచినీరు అందడంలేదని వర్షాకాలం వస్తే రోడ్లు జలమయం అవుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

ప్ర: సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందా ?

జ: సంబధిత శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి లోపాలు ఎక్కడ తలెత్తుతున్నాయో పరిశీలించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

ప్ర: ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై మీ సమాధానం ?

జ: గతంలో ఆక్రమణలు ఉన్న మాట వాస్తవమే ప్రస్తుతం వాటి మీద దృష్టి పెట్టి 70% తొలగించాం. మిగిలినవి కూడా పూర్తిగా తొలగిస్తాం.

ప్ర: మూడు బుట్టల విధానం అటకెక్కిందని ఆరోపణలు ఉన్నాయి?

జ: మూడు బుట్టల విధానం అమలులోనే ఉంది, వాటిపై ప్రజలను చైతన్యపరిచేందుకు పలు కార్యాక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా పురపాలక సంఘానికి సహకరించినపుడే సుందర తెనాలి సాధ్యం అవుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి అంజనీ ప్రియదర్శిని

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరుటౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం అంజనీ ప్రయదర్శిని అన్నారు. స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయ సేవాధికార సంస్థ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన మెజిస్ట్రేట్ మాట్లాడుతూ డిసెంబరు 14న స్థానిక సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి జయరాజు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

పొన్నూరుటౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. పొన్నూరు, నిడుబ్రోలు ప్రాంతాలో గురువారం పారిశుధ్య సిబ్బంది నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, టిడ్కో గృహ సముదాయాలను తాగు నీటి సరఫరా, మురుగు నీటి కాల్వల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం వంటి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించనునట్లు తెలిపారు. అలాగే ముబారక్ నగర్ నుంచి కసుక్రరు వైపు వెళ్లే మెయిన్ డ్రెయిన్ పూడిక తీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు చేబ్రోలులో జాబ్ మేళ

చేబ్రోలు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శుక్రవారం జాబ్ మేళ నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండ సంజీవ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, ఐటీ ఐ, డిగ్రీ, బీటెక్ డిప్లమో, ఫార్మసి పీజీ విభాగాల్లో ఉతీర్ణులైన యువత బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వూకి హాజరకావల్సిందిగా సూచించారు. ఇతర వివరాల కోసం 9666545975 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

తేనె ఉత్పత్తిలో నాణ్యతను పాటించాలి

పొన్నూరుటౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): తేనె ఉత్పత్తిలో నాణ్యతను పాటించటం ద్వారా మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని డీఆర్‌డీఏ ఏపీఎం పీ జోయబాబు అన్నారు. మండల పరిధిలోని దండమూడి గ్రామంలో గురువారం తేనె ఉత్పత్తిదారులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తేనె ఉత్పత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దండమూడి గ్రామాన్ని తేనె హబ్‌గా ఏర్పాటు చేయటానికి ఉత్పత్తిదారులు సమైక్యంగా ఉండి కృషి చేయాలన్నారు. పిప్పోడి, ప్రపోల్లస్, రాయల్ జెల్లి, వ్యాక్ తయారు చేసే యంత్రాలు ఖరీదుతో కూడుకునవని తెలిపారు. తేనె హబ్‌గా రూపొందిస్తే యాంత్రీకరణను అవలంబించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజి బ్యాంకర్ పర్సన్ కేశవ కుమార్, జిల్లా జీవనోపాదుల లైవ్ టాక్ డాక్టర్ కోట్టేశ్వరరావు, లీగల్ కోఆర్డినేటర్ గురు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పొన్నూరుటౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం ద్వారా గురువారం 650 మంది విద్యార్థులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో డాక్టర్ షేక్ మీర్ హుస్సేన్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మెడికల్ కార్డులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీవీఐటీచైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, పూర్వ విద్యార్థులు

వీవీఐటీలో పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు

పెదకాకాని, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు, కళాశాల మధ్య అనుసంధానంతో కళాశాల నిరంతర అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు వీవీఐటీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం (వీవీఐటీ అల్యూమినీ కనెక్ట్)ను విద్యార్థులు ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. 2011 నుంచి వీవీఐటీ కళాశాలకు చెందిన వివిధ బ్యాచ్‌లకు విద్యార్థులను ఒకే వేదికపై తీసుకువచ్చేందుకు ఈ వీవీఐటీ అల్యూమినీ కనెక్ట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులతో ఉద్యోగ అవకాశాలను పంచుకోవడం, నైపుణ్య అంతరాలను పరిష్కరించుకోవడం, వ్యాపార, స్టార్టప్ కంపెనీల ప్రోత్సాహనికి దోహదపడుతుందని వివరించారు. పూర్వ విద్యార్థుల నుండి వచ్చిన సూచనల మేరకు కళాశాల విద్యాసంబంధిత కార్యక్రమాలు, క్యాంపస్‌లో నిర్వహించు సాంకేతిక పోటీలను మెరుగు పడచడంలో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ సందర్భంగా వీవీఐటీ 'అల్యూమినీ కనెక్ట్' బ్రోచర్‌ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, వీవీఐటీ పూర్వ ప్రస్తుత విద్యార్థులు ఆవిష్కరించారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే

● 134వ వర్ధంతి సందర్భంగా నివాళులు



వర్సిటీలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధర్ రావు, ఇతర అధికారులు

పెదకాకాని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహనీయుడు జ్యోతీరావుపూలే అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయనకేంద్రం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పూలే అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఆచార్య ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కుల వ్యవస్థను, జాతి వివక్షను, స్త్రీఅణచివేతను వ్యతిరేకించి సమాజంలో సమానత్వం కోసం కృషిచేశారని అన్నారు. పూలే దంపతులు భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులని, వారు మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందారని వివరించారు. ఆయన మరణించి 134 సంవత్సరాలు అయినప్పటికీ వారి త్యాగాలు చిరస్మరణీయంగా నిలచిపోతాయని తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. వీరయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, స్పోర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీ. జాన్సన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. ప్రమీలా రాణి, ఆచార్యులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి, మారీసుపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వర పేటలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ నేతలు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్, (ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్‌లోని నవచైతన్య బీసీ సంక్షేమ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, నేతలు ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ప్రతాప్, గంగాదేవి, వెంకట్రావు, శ్రీనివాసరావులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదకాకాని, (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెదకాకాని మండల కమిటీ ఆధ్వర్యంలో నేతలు పలువురు జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

పొన్నూరుటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంటూరు బస్టాండ్ వద్దనున్న పూలే విగ్రహానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు రైతు విభాగం ప్రధాన కార్యదర్శి, బీసీ సంఘం నాయకులు బొర్రు రామారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సంఘం నేతలు మాకాని రమేష్, కొండిబోయిన బ్రహ్మయ్య, పోలుపోయిన ఏడుకొండలు, మాకాని బలరామ్, గోగ పున్నారావు, అడపా శ్రీను, సూరిబాబు, శ్రీను, షేక్ సుల్తాన్, సైయ్యద్ జాఫర్, వెంకట్రావు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.